# ద్వితీయ కళత్రం

సుల్తాన్‌బజార్, హైదరాబాదు-దక్కన్
7వ జనవరి 1945.

పెద్దక్కా!

నీ ఉత్తరం అందింది; సంగతులు తెలిసినవి. బాబుకు జ్వరం వస్తున్నదని నీ ఉత్తరంలో చదివి మనస్సు కొద్దిగా చికాకు చెందింది. జ్వరం నిమ్మళించిందని వినడానికి ప్రతిరోజూ ఆతురతగా నీ ఉత్తరం కోసం నిరీక్షిస్తూఉంటాను.

ఇక్కడ యావన్మందీ క్షేమంగానే ఉన్నారు. మీ మరిది మొన్ననే బొంబేకి వెళ్ళి తిరిగివచ్చారు. నాకోసం ఏవోకొన్ని చీరలుకూడ అక్కడి నుంచి పట్టుకొచ్చారు. అందులో ఒకచీరమాత్రం చాలా బాగుంది. ఈసారి నిన్ను కలుసుకున్నప్పుడు ఆచీర నీకు చూపిస్తాను. ఎర్రని వెడల్పాటి అంచు—ఆచీర నిజంగా ఎంతో చూడముచ్చటగావుంది.

మీ మరిదేకాక అత్తగారుకూడా నన్ను చాలా ప్రేమిస్తూన్నారు. మామగారు నన్నుగూర్చి ఈమె మాయింటి లక్ష్మిఅని నలుగురితో చెప్పి మురిసిపోతారు.

మీమరిది తమ మొదటిభార్యని అప్పుడప్పుడు జ్ఞాపకంచేసుకోవడం జరుగుతూనేవున్నా నన్నుమాత్రం ఒక్క నిముషంకూడా మైమరచి ఉండరు. కొద్దిరోజుల్లో ఆమెని పూర్తిగా మరిచిపోగలరనే నా విశ్వాసం. వారు ఆమెని జీవించిఉండగా అమితంగా ప్రేమించినమాట నిజమే— అయినా ఆ ప్రేమ కలకాలం నిలువడం కష్టం—వారి హృదయంలో ఇప్పటికే నాకు కొంతస్థానం లభించింది. పరకీయమైన ఆ హృదయాన్ని

క్రమేణా పూర్తిగా ఆక్రమించుకోగలనని నా పరమవిశ్వాసం—అయినా దేనికైనా భగవత్కృప ఉండడం చాలా అవసరం—

ఉత్తరం ఇక ముగిస్తాను. బాబు ఆరోగ్యం సంగతి త్వరలో తప్పకుండా వ్రాస్తావుకదూ?

ఇట్లు,
మీ లక్ష్మి.

## 2

సుల్తాన్‌బజార్, హైదరాబాదు-దక్కన్
23వ జనవరి 1945.

చిన్నక్కా!

నువ్వు ఉత్తరంవ్రాసి చాలా కాలమైంది.

ఉత్తరం వ్రాయడం ఎందుకు మానుకున్నావో ఎంతఆలోచించినా, ఎంత ప్రయత్నించినా బొత్తిగా అంతు దొరక్కుండా వుంది. నాపైన కోపమేమైనా వచ్చిందా? పొరపాటున నేనేదైనా తప్పుచేసివుంటే క్షమించు—

పిల్లలిద్దరు ఆరోగ్యంగా ఉన్నారా? చిట్టి బాగా అల్లరిచేస్తున్నదనుకుంటాను. అల్లరిలో అది నిజంగా బావనే మించుతుంది. మురళి అల్లరి చెయ్యకుండా రోజూ బడికి వెడుతున్నాడా?

ఇంక నా సంగతి—

మీ మరిది ఒక్క క్షణంకూడా నన్నువిడిచి ఉండలేరు. కాలం సుఖస్వప్నంలాగా గడిచిపోతున్నది. వారు తమ మొదటి భార్యని పూర్తిగా మరిచిపోయినట్లే కనపడుతున్నది. ఇప్పుడు వారు ఆమెని అంతగా తలుచుకోవడంకూడా లేదు. త్వరలో వారు నాకు సర్వవిధాలా విధేయులవుతారనే నా నమ్మకం—

పిల్లలకి నా ముద్దులు.—త్వరగా ప్రత్యుత్తరం వ్రాస్తావుకదూ! తప్పకండా వ్రాస్తావనే ఆశతో ఈ ఉత్తరాన్ని ముగిస్తున్నాను.

ఇట్లు,
మీ లక్ష్మి.

# 3

సుల్తాన్‌బజారు, హైదరాబాదు-దక్కన్.
27వ మార్చి 1945.

నాన్నా!

చాలాకాలంనించి నువ్వు ఉత్తరం వ్రాయడమే మానేశావు. మొన్న మీ అల్లుడుకూడా, ఏవో మాటల సందర్భంలో, ఇదే విషయాన్ని హెచ్చరించారు.

నాన్నా! నువ్వు మీ అలుడికి మంచిది ఒక రవ్వల ఉంగరం కొని పెడతానన్నావు జ్ఞాపకముందా?

అన్నట్టు నా చీరసంగతి ఏమైంది? మామూలుచీర కొనిపెడితే, నేను మాత్రం ఒప్పుకోను. వెడల్పాటిఅంచుతో చూడముచ్చటగా వుండే, తెల్లటి పట్టుచీర కావాలి నాకు. మీ అల్లుడికి తెల్లటి పట్టుచీరఅంటే చాలా యిష్టం—

రవ్వల ఉంగరం, చీరా త్వరలో పంపిస్తావుకదూ?

అమ్మ నాకు ఒక వెండికంచం చేయించియిస్తానన్నది. మీ అల్లుడికీ సంగతి చెపితే, నా కంచం లాక్కుంటామన్నారు. రెండుకంచాలు చేయించిస్తే ఒకటి నాకు, ఇంకొకటి వారికి ఉంటుంది. ఒకటేకంచం యిస్తే, మామధ్య మీరు అనవసరంగా మనస్పర్థలు కల్పించినవాళ్ళు అవుతారు.

ఇంతకీ ఏసంగతైనా బాగా ఆలోచించి చేయడం మంచిది. ఈ సంగతే అమ్మకి నేను గట్టిగా వ్రాసానని చెప్పు.

నేనీ ఉత్తరం వ్రాస్తుంటే మీ అల్లుడు కాగితం లాగేస్తున్నారు. మీ కంచం అప్పుడే తగవులకి కారణభూతమైందని, ఇకనైనా మీరు ఒప్పుకుంటారా?

ఇట్లు,
నీ అల్లరి లచ్చి.

# 4

సుల్తాన్‌బజార్, హైద్రాబాదు-దక్కన్.
19వ ఏప్రిల్ 1945.

శారదా!

నువ్వు చాలా అల్లరిపిల్లవయిపోయినావు. కాపురానికి వచ్చిన ఒక సంవత్సరంలోగా ఎవరికైనా పిల్లలు పుడుతారా? నువ్వు పెళ్ళిచేసుకుంటే బహుశా నీకు ఆరుమాసాల్లోగానే పిల్లలు పుడుతారనుకుంటాను.

నువ్వుచేసిన అల్లరిచూసి నాకు నిజంగా వళ్ళు మండింది. "ఇది అల్లరి ఎందుకవుతుంది? నా శుభాకాంక్షలంటావా?" అవును, నువ్వు ఏదైనా అనడానికి సమర్థురాలివి. అల్లరి కాకపోతే ఆ టోపీ, గౌనూ పంపించడ మెందుకు చెప్పు—ఇంత ఈడువచ్చినా నువ్వు నీ అల్లరిచేష్టలు మానుకోవు గదూ?

ఆఁ మరిచిపోయినా. ఎక్కడైనా వరుణ్ణి వెతుక్కున్నావా? వెతుక్కుంటే చెప్పు—అనవసరంగా దీనిలో సిగ్గుపడడమెందుకు?

నాకు పెళ్ళిఅయి, దాదాపు సంవత్సరం కావస్తున్నది. మావారికి నేను రెండవ భార్యని.

మొదటి భార్య చనిపోయింది. ఆమె చనిపోయిందన్నమాటే కాని, ప్రతినిమిషానికీ ఆమె సజీవంగా నాకు కనపడుతూనే వుంటుంది. యింట్లో అడుగడుగునా, ఆమె జ్ఞాపకచిహ్నాలు కొల్లలు కొల్లలుగావున్నాయి. వాటినిచూస్తే నాకు ఎందుకో మనస్సు చివుక్కుమంటుంది. ఇప్పటికీ యిల్లంతా ఆమెమయంగా కనపడుతున్నది.

కొనవాకిలికి ఎదురుగా, ఆమె 'బస్టు' ఒకటి వ్రేలాడగట్టివుంది. అక్కడనుండి ఆమె నన్ను సర్వదా, ఒకకంట కనిపెడుతున్నట్లు నాకు తోస్తుంది. నన్నగా చిరునవ్వుతూ, 'నువ్వు ఈ యింటి యజమానురాలవి ఎన్నటికీ కానేరవ'ని ఆమె నన్ను అవహేళన చేస్తున్నట్లు స్పష్టంగా దృగ్గోచరమవుతుంది. ఒక్కుమ్మడిగా నాకు శరీరం కంపరమెత్తుతుంది.

మనిషివలన కొన్ని పొరపాట్లు జరుగుతూఉండడం సహజం. నావల్ల అనాలోచితంగా ఏమైనా పొరపాట్లు జరిగితే, 'సుందరి' ఈవిధంగా చేసేది కాదని, మావారు చప్పున అనేస్తారు. నాకు నిలుచున్నపాటున, అమాంతంగా తలగొట్టినట్లు అవుతుంది.

నామట్టుకు నేను ప్రతివిషయంలోకూడా ఎంతో జాగర్తగా వుంటాను. బహుశా ఈ అతిజాగర్తవల్లనే నావల్ల ఏవో పొరపాట్లు జరుగుతాయనుకుంటాను. పొరపాటు జరిగిందని శిక్షిస్తే, నాకంత పట్టింపు వుండదు. కాని నన్ను ఆమెతోపోల్చి, నేను చేసినపని బాగుండలేదంటే మాత్రం నాకు ఎంతో కష్టంగా వుంటుంది.

ఏపనిచేసినా, ఆమె నన్ను అనుసరిస్తున్నట్టే, నాకు కనపడుతుంది. ఒకొకసారి భయమేసి, నేను వెనుదిరిగి చూడటంకూడా జరుగుతుంది.

ఒక్క మావారేకారు. అత్తామామలుకూడా, నా ప్రతిపనిని, ఆమె పనులతో పోల్చి, తమకు తెలియకండానే నన్ను అవమానపరచడం జరుగుతున్నది.

నాకింత ఆత్మాభిమానం ఎక్కడనించి వచ్చిందో నాకుమాత్రం దురూహ్యంగావుంది.

నా జీవితం, ఒక నిత్యసంఘర్షణగావుంది. వారి హృదయఫలకం నించి, సుందరమ్మ చిత్రాన్ని తుడిచివేయడంలో, చివరికి కృతకృత్యురాల్ని అవుతానో లేదోకూడా తెలియదు. ప్రయత్నంమాత్రం చేస్తున్నాను. చివరకి విజయం నాకే చేకూరుతుందని నా అంతరాత్మ పలుకుతున్నది.

వారు వచ్చేవేళ అయింది. ఇక ముగిస్తాను.

త్వరగా జవాబు వ్రాస్తావుకదూ—జవాబు వ్రాయకపోతే, నాకు నీపైన తప్పకుండా కోపమొస్తుంది.

ఇట్లు,
నీ శ్రీ.

## 5

సుల్తాన్‌బజార్, హైద్రాబాదు-దక్కన్.
20వ జూన్ 1945

చిన్నక్కా!

'చిట్టికి అక్షర శ్రీకారం'—తప్పక రమ్మని వ్రాశావు! ఇక్కడి పరిస్థితుల్నిబట్టి నేను ఇక్కడినించి బొత్తిగా కదలటానికి వీలులేదు.

మీ మరిదికి, గతవారంనుంచి ఒకటేజ్వరం—ఉపచారం జరుగుతున్నది. డాక్టరు మొదట మలేరియా అని చెప్పి, ఇప్పుడు టైఫాయిడ్‌లోకి తేల్చాడు. ఇంకా ఏదీ యిదమిద్ధమని చెప్పటానికి వీలులేదు. జ్వరం మాత్రం మహాతీవ్రంగావుంది. అందుకోసమే ఉత్తరం వ్రాయడంలో కొద్దిగా ఆలస్యమైంది.

ఒకమాసంనించి అమ్మా, నాన్నదగ్గరినించి ఏలాంటి ఉత్తరంకూడా రావడంలేదు. ఎందుకు వ్రాయలేదో కారణం తెలియదు. ఏసంగతీ కనుక్కొని, నువ్వైనా ఒక ఉత్తరం వ్రాయి.

నేను ఇక్కడికివచ్చి దాదాపు ఆరుమాసాలు అయింది. మిమ్మల్ని ఎప్పుడు చూతామాఅని మనసు తెపతెపలాడుతున్నది. వారికి నిమ్మళించడంతోనే, అక్కడికి, రెక్కలు కట్టుకొని వచ్చివాల్తాను.

ఇట్లు,
మీ లక్ష్మి.

## 6

సుల్తాన్‌బజార్, హైద్రాబాదు-దక్కన్.
6వ ఆగస్టు 1945

పెద్దక్కా!

మీ మరిదికి ఇప్పటిప్పుడే కొద్దిగా జ్వరం నిమ్మళిస్తున్నది. వరుస జ్వరం, త్వరలో పూర్తిగా వదలడం చాలాకష్టం. జ్వరంవల్ల మనిషి గుర్తుపట్టకండా అయిపోయినారు. కొద్దిగా చికాకుకూడా ఎక్కువైంది.

వారు పూర్తిగా కోలుకోవడంతోనే, మీ అందరిదగ్గరికి ఒకసారి రావాలనివుంది. ఎప్పుడువస్తానోఏమో ఇప్పుడప్పుడే చెప్పడానికి వీలులేదు. అయినా త్వరలోనే రావాలనిమాత్రం అనుకుంటున్నాను.

బాబుకి నా ముద్దులు—వాడు సరిగ్గా చదువుకుంటున్నాడా? బావకి ప్రొమోషన్ దొరికిందా?

ఈసారివ్రాసే ఉత్తరంలో, పై సంగతులన్నీ వివరంగా వ్రాయి.

ఇట్లు,
మీ లక్ష్మి.

## 7

సుల్తాన్‌బజార్, హైద్రాబాదు-దక్కన్
30వ సెప్టెంబరు 1945.

శారదా!

పోయినసారి నీకు ఉత్తరం చాలా తొందరలో వ్రాశాను. ఏమి వ్రాసానో కూడా ఇప్పుడు జ్ఞాపకంలేదు.

అప్పట్లో మావారికి జ్వరం తీవ్రంగా వుండడంవల్ల, ఏమీ వ్రాయడానికికూడా పాలుపోలేదు. ఇప్పుడు వారికి జ్వరం పూర్తిగా నిమ్మళించింది. జ్వరం నిమ్మళించడంతో. వారికి చికాకు మరీ ఎక్కువైంది.

అది చికాకు అంటే చికాకు కాదు. వారు మాటి మాటికీ మొదటి భార్యని తలుచుకోవడం, ఇంట్లో వున్నవాళ్ళందరినీ కసురుకోవడం జరుగుతున్నది. నేను ఒక్కక్షణం కనపడకపోతే,- ఇప్పుడు వారు నన్నుకూడా ఈసడించుకోవడం జరుగుతున్నది.

ప్రొద్దస్తమానం ఎడ తెరిపి లేకుండా వారికి సపర్యలు చేయడంతో, నా కాలం గడుస్తున్నది. నేనీ యింట్లో దాసికన్నా నికృష్టమైనాను. నేనేమి చేసినా వారికి మెప్పన్నమాట లేదు. చిరాకు పడడం తప్ప, వారు నాపట్ల ఇంకొక విధంగా ప్రవర్తించలేరన్న సంగతి, నాకు ఇప్పుడిప్పుడే తెలిసి వస్తున్నది.

మొదటి మోస్తరే నా నిత్యసంఘర్షణ కొనసాగుతున్నది. 'సుందరి ఈవిధంగా చేసేదీ, ఆ విధంగా చేసేదీ' అన్నమాటలు రోజూ నాచెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. చిరాకు పడకుండా తమకి ఏమికావాలో, చెప్పి చేయించుకుంటే, నిజంగా నేనెంతో సంతోషించేదాన్ని. కోప్పడి చేయించుకున్నా, నాకేమీ అభ్యంతరం లేదు.

కాని ఒక చెంపని చిరాకుపడుతూ, ఇంకొక చెంపని నా పనిని మొదటి భార్య పనులతో పోలుస్తూ, ఎత్తిపొడవడంమాత్రం చూస్తే, నాకెంతో బాధగా వుంటున్నది.

మొదటి భార్య నన్ను భూతమై పట్టి వేధించినా, నేను ఇంత బాధ పడేదాన్ని కాను. ఎక్కడో అగోచరంగా వుండి ఆమె నన్ను ఇంత బాధించడం దేనికో, నాకు బొత్తిగా అర్థం కావడం లేదు. సర్వదా నన్ను వెన్నంటుతూ ఆమె నాకు కలలోనైనా చివరకు కనిపించదు. అగో

తరంగావుండి, నన్ను శోధించుకు తినడమే ఆమెకి యిష్టంగా వున్నట్లు కనపడుతుంది.

ఇంట్లో ఈమధ్య ఆమె జ్ఞాపకచిహ్నాలు మరీ ఎక్కువైనాయి. ఒక 'బస్టు'కి బదులు ప్రస్తుతం యింట్లో మూడు బస్టులు తయారయినాయి.

ఒకటి నాపడకగదిలోనే వ్రేలాడగట్టి వుంది. ఆమె చివరకి నాపడకగదిలోకూడా ప్రవేశించడంచూచి, నా శరీరం దహించుకపోతున్నది. పడకగదిలో మా యిరువురి మధ్య ఆమె వుండడం ఎందుకో నాకు పూర్తిగా అర్థం కావడం లేదు.

శ్రీసీతారామంతే వారు ఏమనుకుంటారో అని మౌనం వహించాల్సి వస్తున్నది. తియ్యకపోతే, అవహేళనతో కూడుకొనిన ఆ చిరునవ్వు, నన్ను తప్పక పిచ్చిదాన్ని చేస్తుందని నాకు భయం వేస్తున్నది.

స్వయంగా నాయింట్లోనే, నేను నాకిష్టమొచ్చినట్లు ఉండలేకపోతున్నందుకు, నాకు నిజంగా పిచ్చెత్తుతున్నది. ఏమీతోచక మనస్సంతా, కడితిలోపడ్డ ఎలక మోస్తరు గిజగిజ కొట్టుకుంటున్నది.

ఇక ఆమెను జయించడం దుర్ఘటమని, హృదయం నెమ్మదిగా నిరాశ జెందుతున్నది.

శారదా! ప్రస్తుతం నేను ఏమి చెయ్యాలను చెప్పు—మార్గాంతరం ఏదైనా ఆలోచించగలవా?

కొంత హృదయభారమైనా తగ్గుతుందేమో, ఒకమాటు నువ్వు నా దగ్గరికి ఎందుకు వచ్చెయ్యకూడదు? వస్తావుకదూ? తప్పకుండా వస్తావన్న ఆశతో, ఈ ఉత్తరాన్ని ముగిస్తున్నాను.

ఇట్లు
హృదయారాటంతో నీకోసం
ప్రతిక్షణం నిరీక్షిస్తున్న
నీ లక్ష్మి

# 8

సుల్తాన్‌బజార్, హైదరాబాద్-దక్కన్.
12-వ డిశంబరు 1945

నాన్నా!

నేనిక్కడికి రెండవసారి వచ్చి దాదాపు ఒక సంవత్సరమైంది.

ఈ సంవత్సరంలోపుగా మీరు నన్ను ఒక్క సారైనా చూచి వెళ్ళలేదు.

తండ్రి కఠినుడౌతే, కూతురు ఎక్కడైనా కఠినురాలవుతుందా?

ఎల్లుండి నేను వరంగల్‌కి వస్తున్నాను. స్టేషనుకు మనిషి నెవరినైనా తప్పక పంపించండి.

ఇట్లు
మీ లక్ష్మి

# 9

హనుమకొండ (వరంగల్)
2-వ మార్చి 1946

శారదా!

వరంగల్‌కి రావడంతోనే, నీకు ఉత్తరం వ్రాతామనుకున్నాను. కాని మనసు చికాకుగా వుండడంవల్ల అనుకున్నట్లు నీకు ఉత్తరం వ్రాయలేక పోయాను.

నేను వరంగల్‌కి జనవరి 14-వ తేదీన చేరాను. నాలుగు రోజుల తర్వాత, చిన్నక్కనీ, పెద్దక్కనీ చూడడానికి బయలుదేరాను.

నేను వరంగల్‌కి తిరిగివచ్చి దాదాపు పదిహేను రోజులయింది. ఈ పదిహేనురోజుల్లో మనస్సు కాస్త స్థిమితం జెందింది. అందుకోసమే ప్రస్తుతం ఈ వుత్తరం వ్రాయడానికి ఉపక్రమించాను.

శారదా! నా వైవాహిక జీవితం జనవరి 14-వ తేదీతో అంత మొందింది. ఈ సంగతి యింకా యింట్లో ఎవరికీ తెలియదు. క్రమేణా వాళ్ళకే తెలుస్తుందని నా ఊహ—నేనుకూడా మౌనం వహించాను.

ఎవరికైనా, దుర్భర జీవితాన్ని ఎక్కువ రోజులు గడపడం చాలా కష్టంగా వుంటుంది.

ఒకరోజు ఎన్నడూ కనపడని సుందరమ్మ నా కలలోవచ్చి, "నువ్వీ యిల్లు వదిలిపెట్టి వెళ్ళి పోతావా, లేదా?" అని నిక్కచ్చిగా అడిగింది. ఆమె కనపడి పైవాక్యం ఉచ్చరించడంతోనే నేను కెవ్వున కేకేసి ఒక్కమాటే అఘాటుపాటున లేచి కూర్చున్నాను.

ఆరోజు నా ఖర్మం చాలక, వారుకూడా యింట్లో లేరు. లేచి కూర్చునే సరికి, ఎదురుగా సుందరమ్మ, బస్టులోంచి చిరునవ్వు నవ్వడం తప్పున కనపడింది.

నాకు భయంవల్ల, నరనాడులు కృంగిపోయినాయి. భయంతో శరీరం కంపరమెత్తింది. ఏదోవిధంగా గదిలోంచి బయటపడి, త్వరగా మా అత్తయ్య దగ్గరికి పరుగెత్తాను. అత్తయ్యగది, లోపలినించి గడియ వేసి వుంది.

నేను పరుగెత్తుతుంటే, నా వెనకాలే, ఎవరో పరుగెత్తుతున్నట్టు నాకు తోచింది. వెనుదిరిగిచూస్తే ఎవ్వరూ కనపడలేదు.

భయంవల్ల శరీరమంతా ముచ్చెమటలు పోశాయి. అత్తయ్యని పిలుద్దామంటే, నోటమాట పెకల్లేదు. చేసేదేమీలేక నాలోఉన్న ధైర్యాన్నంతా ఒకచోటికి పోగుచేసి, మనహాల్లో వున్న సుందరమ్మ బస్టు తిరిగి కనపడకుండా జాగర్త పడుతూ, పనిమనిషి ఎక్కడపడుకుందో, వెతకటానికి బయలుదేరాను.

నా వెనకాల అడుగుల చప్పుడు వినబడుతూనే వుంది. అది వట్టి భ్రమో లేక నిజంగా అడుగుల చప్పుడేనో, నేను ప్రస్తుతం నిక్కచ్చిగా

చెప్పలేను. అప్పట్లో తిరిగి అత్తయ్యని పిలుద్దామనిపించింది. కాని లోపలి నించి గడియవేసివున్న సమయంలో, ఆమెని పిలవడం సమంజసంకాదని తెలుసుకొని, తిరిగి కొద్దిగా ధైర్యం తెచ్చుకొని, అక్కడించి చడీచప్పుడు లేకుండా అడుగులో అడుగువేసుకుంటూ, దాసీదాన్ని గట్టిగా కావలించుకున్నాను.

నా శరీరమంతా ఆడే పనిగా వణకడం గమనించి, అది సంగతి సందర్భాలు తెలుసుకొని, నాతో వచ్చి పడుకోడానికి సిద్ధపడింది.

ఆదేరాత్రి తిరిగి పడక గదిలోకి వెళ్ళి పడుకోడానికి నాకు అమితంగా భయమేసింది. అందువల్ల దానిచేతే, లోపలినించి ఒకచాప తెప్పించుకొని, గడపలో వేసుకొని పడుకొన్నాను.

పడుకున్నానన్నమాటే కాని, ఎంతకీ నిద్రపట్టదు. నాకు అప్పట్లో ఎక్కడచూస్తే అక్కడే సుందరమ్మ కనపడటం మొదలెట్టింది. భయంవల్ల, దాసీదాన్ని ఆ రోజు మాటిమాటికీ నిద్రలేపడం మొదలెట్టాను. అది విసుక్కొని, ‘ఆమె చల్లనితల్లి అమ్మా—సుందరమ్మ దొరసాని మా కెవరికీ కనపడంది మీకెట్లా కనపడిందమ్మా’ అని అనడం మొదలెట్టింది. ఆమెపేరు ఎత్తకే అంటే అది ఎంతకూ వినదు. ఆమెపేరు ఎత్తినప్పుడల్లా నాకు శరీరమంతా తేళ్ళూ జెర్రిలు ప్రాకినట్లు అయ్యేది. భయమేసి రాత్రంతా నిద్దర పట్టకపోవడంవల్ల, తెల్లవారుఝామున కొద్దిగా కునుకు పట్టింది. అందువల్లనే ఉదయం నిద్దర లేవడానికి కొద్దిగా ఆలస్యమైంది.

ఈలోగా మా అత్తయ్య నేను గడపలో పడుకున్న సంగతిచూచి నన్ను లేపి, ‘సంగతేమిట’ని అడిగింది. నేను జవాబుగా ‘ఏమీ లేదని’ మౌనం వహించాను.

దాసీదానివల్ల రాత్రి జరిగిన సంగతి, ఒక అరగంటలో ఇల్లంతా పాకిపోయింది.

రాత్రి నేను ఏదో అనవసరంగా నాటకమాడానని, అత్తామామలు నన్ను తూలనాడారు. నన్ను తూలనాడటంతో సంతృప్తి జెందక, సుందరమ్మ గుణగణాల్ని కూడా స్తుతించారు. అయినా, నాకేమీ తెలియనట్లుగానే నేను ఆరోజు పగలంతా మౌనం వహించాను.

ఆనాటి సాయంత్రమే మావారుకూడా ఇంటికి వచ్చారు. మా అత్తగారు ఊరుకోక గొప్పరాద్ధాంతం చేస్తూ, వారి చెవులోకూడా ఈ సంగతి వేసారు.

వారు ఈ సంగతి విన్నదే తడవుగా నన్ను గదిలోకి పిలిచి, 'రాత్రి ఏమి జరిగిందని' అడిగారు. నేను వారిపైగల విశ్వాసాన్ని పురస్కరించుకొని, రాత్రి జరిగిన సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పాను.

వారు సర్వమూవిని, "ఇదంతా సర్వాబద్ధమని" నాపైన గుడ్లెర్రజేసారు. నేను "కాదు, ముమ్మాటికి సత్యమని" నొక్కి చెప్పాను.

ఈసారికూడా వారు నామాటలు నమ్మలేదు.

"ఈర్ష్యవల్ల నేను సుందరమ్మని నిందిస్తున్నాన"ని వారు అన్నారు. నేను కాదని రుజువు చేయడానికి ఎన్నో విధాల ప్రయత్నించాను. వారు నామాట ఒక్కటికూడా నమ్మలేదు. మీదు మిక్కిలి 'నీకు సుందరమ్మ అంటే ఈర్ష్య, అందుకోసమే నువ్వు ఆమె చీరెలూ, నగలు ధరించడం లేద'ని నన్ను నిందించారు.

నేను అక్కడికీ మౌనం వహించాను.

"నీకు నాయిష్టుల్ని చూస్తే ఈర్ష్యగా వుంటుంది. అందుకోసం నాయింట్లో వుండడానికి తగవని" నన్ను అవమానపరిచారు.

అంతటితో నాకు ఆ యింటిపైన మనసు విరిగింది. భర్తంటే ఒక విధమైన అయిష్టత ఏర్పడింది.

అక్కడికి నన్ను ఆ యింట్లో, చివరికి దాసీదానిపలెనైనా ఉండనివ్వమని ప్రాధేయ పడినాను. వారు ససేమిరా వల్లకాదన్నారు.

చేసేదేమీ లేక ఆరోజు రాత్రే "నేను ఎల్లుండి వరంగల్ వస్తున్నానని" నాన్నకి ఉత్తరం వ్రాశాను.

ఆరోజురాత్రికూడా నేను నా గదిలో పడుకోలేదు. నాకు పడకగదంటే ఒక విధమైన భయం యేర్పడింది. ఆ రాత్రికూడా నాకు తిరిగి భయంవల్ల నిద్రపట్టలేదు.

మూడవనాడు ఉదయం తిరిగి రాద్ధాంతాలు ప్రారంభమైనాయి. నాకు ఆ రాద్ధాంతాలతో ఏమీ సంబంధంలేనట్లు నేను నావస్తువుల్ని సర్దుకోవడంలో నిమగ్నమైనాను.

మూడవనాటిరాత్రికూడా మా యిరువురికి తిరిగి ఘర్షణ జరిగింది. ఆనాటిరాత్రే నేను ఆ యింటిని శాశ్వతంగా వీడిపోతున్నానని నాకు విస్పష్టంగా తోచింది.

నాల్గవనాడు ఉదయమే, హైదరాబాదునించి బయలుదేరి, మధ్యాహ్నానంతరం వరంగల్ చేరుకున్నాను.

వరంగల్ చేరుకోవడంతో, నాభయంతోపాటు, అత్తవార యిల్లు కూడా శాశ్వతంగా వదలిపోయింది.

ఇదీనాకథ.—

ఇట్లు
నీ లక్ష్మి

## 10

హనుమకొండ (వరంగల్)
30 వ మే 1946

శారదా!

విశేషాలేమీ లేవు. నాభర్త తిరిగి మూడవసారి పెళ్ళి చేసుకున్నారని విన్నాను.

అంతే—

ఇట్లు
నీ లక్ష్మి